

19 వ వసంతంలోకి ...

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

ఏలూరు జిల్లా పశ్చిమ గోదావరి జిల్లా

గురువారం,30 అక్టోబర్ 2025

8 పేజీలు


## తుఫాన్ సహాయక చర్యలు

# ముమ్మరం చేయాలి






- 25 కేజీల బియ్యం,కందిపప్పు,పంచదార, వంట నూనె,కూరగాయలు ఇవ్వాలి
- చేనేత,మత్స్యకార కుటుంబాలకు అదనంగా 25 కేజీల బియ్యం
- మనిషికి వెయ్యి,గరిష్టంగా కుటుంబానికి 3వేలు అందించాలి
- అధికారులతో జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ సమీక్ష

**ఏలూరు,మేజర్‌న్యూస్ :** జిల్లాలో తుఫాన్ సహాయక కార్యక్రమాలను ముమ్మరం చేయాలనీ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లో బుధవారం తుఫాన్ సహాయక కార్యక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపాల్ కార్యదర్శి మరియు తుఫాన్ సహాయక కార్యక్రమాల పర్యవేక్షణ జిల్లా ప్రత్యేక అధికారి కాంతిలాల్ దండే, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి,తో కలిసి అధికారులతో మంత్రి సమీక్షించారు.ఈసందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ప్రభుత్వ యంత్రాంగం తీసుకున్న ముందస్తు జాగ్రత్త చర్యలతో మొంథా తుఫాన్‌ను సమర్ధవంతంగా ఎదుర్కొన్నామన్నారు.జిల్లా మంత్రి కొలుసుపార్ధసారథి, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఇతర స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, కూటమి పార్టీ నేతలు క్షేత్రస్థాయిలో ప్రజలసమస్యలను అధికారులదృష్టికి తీసుకువచ్చారని, వాటిని అధికారులు పరిష్కరించడం నష్టాన్ని నివారించగలిగామన్నారు. జిల్లా యంత్రాంగం మనసు పెట్టి మంచి స్ఫూర్తితో పనిచేశారని,అదేస్ఫూర్తితో తుఫాన్ అనంతరం సహాయక కార్యక్రమాలను ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగని రీతిలో చేపట్టాలని, వాటితో పాటు ఆస్థి, పంట, పశునష్టం అంచనాలను ఈనెల 30వ తేదీ నాటికి పూర్తి చేయాలనీ మంత్రి చెప్పారు.జిల్లాలో 90 తుఫాన్

- తరువాయి 2లో..

## రానున్న రెండు రోజులలో పెద్దఎత్తున పారిశుద్ధ్య

# కార్యక్రమాలు

### జిల్లా అంతటా చేపట్టాలి

### – అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశం



**ఏలూరు,మేజర్‌న్యూస్:**రానున్న రెండురోజులలో జిల్లా అంతటా పెద్దఎత్తున పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని జిల్లాకలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుండి బుధవారం తుఫాన్ అనంతరం పారిశుద్ధ్య,సహాయక కార్యక్రమాలు, నష్టంనివారణ అంచనాలపై అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ మొంథా తుఫాన్ కారణంగా జిల్లాలో భారీవర్షాలు సంభవించాయని, వర్షాలుకారణంగా గ్రామాలు,పట్టణాలు, నగరాలలో వరదనీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ఎక్కడా చెత్త లేకుండా శుభ్రం చేయించాలని, త్రాగునీరు కలుషితం కాకుండా క్లోరినేషన్ చేయించి సరఫరా చేయాలన్నారు.త్రాగునీటి పైపు లైన్లు, డ్రైనేజి పైపు లైన్లు కలవకుండా చూడాలన్నారు.తుఫాన్ కారణంగా దెబ్బ తిన్న పంటల నష్టాలను వ్యవసాయశాఖసిబ్బంది

- తరువాయి 2లో..

## తుఫాను ప్రభావం తగ్గే వరకు పునరావాస కేంద్రాల్లోనే

### – బాధితులతో కలిసి సహపంక్తి భోజనం చేసిన జిల్లా కలెక్టర్ నాగరాణి



**నర్సాపురం రూరల్,మేజర్‌న్యూస్:** తుఫాను తీరం దాటిన అనంతరం చర్యలలో భాగంగా బుధవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి నరసాపురం, మొగల్తూరు ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన పలు పునరావాస కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు.తొలుత జిల్లా కలెక్టర్ నరసాపురం మండలం డిజిటల్ భవన్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించి, ఆశ్రయం పొందినవారిని ఆప్యాయంగా పలకరించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.పునరావాస కేంద్రంలో అన్ని ఏర్పాట్లు బాగున్నాయా, భోజనం ఎలా ఉంది, మాఅధికారులు బాగానే స్పందిస్తున్నారా తదితర వివరాలను తెలుసుకున్నారు. బాధితులకు భోజనాన్ని స్వయంగా వడ్డించి

- తరువాయి 2లో..

## అంగట్లో ఆడ శిశువు విక్రయంపై చర్యలకు ఆదేశం

**నల్గొండ/ఏలూరు,మేజర్‌న్యూస్:**తెలంగాణరాష్ట్రంలోని నల్గొండలో జరిగిన శిశు విక్రయంపై తక్షణ చర్యలు చేపట్టాలని రాష్ట్ర బాలల పరిరక్షణ కమిషన్ ఆదేశించింది. నల్గొండ జిల్లా తిరుమలగిరి సాగర్ మండలం ఎల్లాపురం కు చెందిన కొర్ర బాబు, పార్వతి దంపతులకు నాలుగో సంతానంగా అమ్మాయి పుట్టడంతో కుటుంబానికి భారమవుతుందనే ఉద్దేశంతో ఏపీలోని ఏలూరుకు చెందిన వారికి అమ్మజూపిన ఉదంతం వెలుగు చూడటంతో కమిషన్ స్పందించింది. జిల్లా ఐసీడీఎస్ సిబ్బంది, చైల్డ్ ప్రొటక్షన్ యూనిట్, సీడబ్ల్యూసీ అధికారులు ఈఅంశంపై విచారణ చేపట్టడంతో విషయం బహిర్గతమైంది.చట్టవిరుద్ధంగా పసికందు దత్తతను ప్రోత్సహించిన వారిపై చర్యలుతీసుకోవాలని కమిషన్ ఆదేశించింది. పసికందును పది రోజుల పాటు తెలంగాణ స్టేట్ హోమ్ పరిరక్షణలో ఉంచాలని ఆదేశించింది. నల్గొండ జిల్లా కేంద్రంలో పదేపదే ఈతరహాలో ఘటనలు జరుగుతున్నా అధికారులునిర్లక్ష్యం వహిస్తున్నారంటూ కమిషన్ అసంతృప్తి వ్యక్తం చేసింది.



**– సుమోటోగా తీసుకుని లోకాయుక్త విచారణ –**

ఆడశిశువు విక్రయ వ్యవహారంపై నివేదిక సమర్పించాలంటూ మహిళాశిశు సంక్షేమశాఖాధికారి కృష్ణవేణి తోపాటు జిల్లా బాలల రక్షణ అధికారులకు లోకాయుక్త జస్టిస్ ఎ.రాజశేఖర్రెడ్డి

- తరువాయి 2లో..

## రానున్న రెండు నెలల్లో కాలువలు, డ్రైయిన్లు ప్రక్షాళణ



### – శాసనసభ ఉపసభాపతి రఘురామ కృష్ణంరాజు స్పష్టికరణ

**ఉండి,మేజర్‌న్యూస్ :** ఉండి మండలం వాంద్రం గ్రామంలో మొంథా తుఫాన్ కారణంగా బలమైన గాలుల ప్రభావంతో నేలకొరిగిన వరి పంటను బుధవారం రాష్ట్రశాసనసభ ఉపసభావతి కనుమూరి రఘురామ కృష్ణంరాజు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణితో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ వాంద్రం గ్రామం లోని 600 ఎకరాలకు సంబంధించిన నీరు ఇసుకడ్రెయిన్ ద్వారా వెళ్లవలసి ఉంటుందని,డ్రెయిన్ కుంచించుకుపోవడంతో సాగునీరు సాఫీగా పారుదలలేక పంట నష్టపోతున్నామని ఉపసభాపతి రఘు రామకృష్ణంరాజు దృష్టికి తీసుకురాగా ఈసమస్య పరిష్కారానికి ఆక్రమణలను తొలగించి

- తరువాయి 2లో..

# నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు - విద్యుత్తుకు అంతరాయం





**– యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణతో ప్రజల హర్షం**

**యలమంచిలి,మేజర్ న్యూస్ :** మొంథా తుఫాన్ ప్రభావంతో మండల వ్యాప్తంగా 100కి పైగా విద్యుత్ స్తంభాలు నేల కొరిగాయి. దీంతో మంగళవారం ఉదయం నుండి బుధవారం మధ్యాహ్నం వరకు మండల వ్యాప్తంగా విద్యుత్తుకు అంతరాయం ఏర్పడింది.దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడింది.అయితే విద్యుత్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన మండల వ్యాప్తంగా సుమారు 90 మంది తో ఐదు బ్యాచ్లుగా విడిపోయి రెండు క్రేన్లు, రెండు జెసిబి లు, రెండు మిషన్లు, ట్రాక్టర్లు,వ్యాన్ల సహాయంతో కరెంటు స్తంభాలను పునరుద్ధరించి సాయంత్రంకి విద్యుత్ పనులు పూర్తిచేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేశారు.దీంతో ప్రజల హర్షం వ్యక్తం చేశారు.యలమంచిలి ఎలక్ట్రికల్ ఏఈ చండీ కిరణ్తో పాటు ఇతర ప్రాంతాల నుండి వచ్చిన మరొక ఇద్దరు ఏఈ లు దగ్గరుండి పనులు పూర్తి చేయించారు.ఈ పనులను భీమవరం ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ ఎస్ ఇ ఉషారాణి, డిఈ మధు కుమార్,ఏడిఈ రామకృష్ణ తదితరులు పర్యవేక్షించారు.

– పవర్ రాకతో ప్రజల్లో ఆనందోత్సాహాలు

–మొంథా తుఫాన్ ప్రభావంతో గత రెండు రోజులుగా మండలంలో విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. కరెంట్లేని కారణంగా ఇన్ వేటర్లకు ఛార్జింగ్ లేనందువల్ల ఓవైపు వీధిలైట్లు వెలగక మరోవైపు గృహాల్లో ఇన్వెర్టర్లు పనిచేయక అంధకారంతో ప్రజలు తీవ్ర బాధలకు గురయ్యారు.ఎలక్ట్రికల్ అధికారులు స్పందించి నేలకొరిగిన విద్యుత్తు స్తంభాలను నిలబెట్టి మరమ్మతులు చేయడంతో బుధవారం సాయంత్రం ఏడు గంటలకు విద్యుత్ సరఫరా చేయడంతో ప్రజల్లో ఆనందోత్సాహాలు వెల్లి విరిసాయి.

# తుఫాను ప్రభావం తగ్గే వరకు పునరావాస కేంద్రాల్లోనే

మొదటిపేజి తరువాయి

కలెక్టర్ కూడా వారితో పాటు కూర్చుని వారు తినే పదార్థాలనే ఆమె కూడా భుజించడంతో వారిలో ఒకింత ఆశ్చర్యం, ఒకింత మనోధైర్యం కనిపించాయి.భోజనం చేస్తూనే బాధితులతో యోగక్షేమాలు మాట్లాడుతూ ఇప్పటికే కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి మీనిర్మలమ్మ మీగ్రామంపై ప్రత్యేక శ్రద్ధతో అనేక కార్యక్రమాలను చేపట్టి పూర్తి చేస్తున్నారని,త్వరలో సముద్రపు కోత అడ్డుకట్ట నిర్మాణం కూడా పూర్తి కావస్తుందని,తుఫాన్ల సమయంలో భయపడవలసిన అవసరం ఉండదని ధైర్యం చెప్పారు. పెద్దమైన వాని లంక వద్ద ఒక కిలోమీటర్ పరిధిలో నిర్మిస్తున్న సముద్ర కోత అడ్డుకట్ట నిర్మాణాన్ని స్వయంగా పరిశీలించారు.సంబంధిత ఏజెన్సీ ప్రతినిధితో మాట్లాడి పనులు ఎప్పటికీ పూర్తి అవుతాయి, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. డిసెంబర్ నాటికి ఎట్టి పరిస్థితుల్లో నిర్మాణం పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం వేముల దీవి మత్స్యకార బాలుర బీసీ వెల్ఫేస్ స్కూల్లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శిం చారు. లోతట్టు ప్రాంతాల్లో పూర్తిగా తొలగేంత వరకు పునరావాస కేంద్రాల్లోనే ఉండాలని తెలిపారు. తదుపరి మొగల్తూరు కేపీ పాలెం తుఫాన్ రక్షిత భవనంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించి ఆశ్రయం పొందిన వారితో ఏర్పాట్లపై ఆరా తీశారు. మార్గం మధ్యలో ఎన్ డి ఆర్ ఎఫ్ బృందాలను కలుసుకొని వారి సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో నరసాపురం ఆర్డీవో దాసిరాజు, తహసిల్దార్లు ఐతం సత్యనారాయణ,రాజ్ కిషోర్, అనిత కుమారి, ఎస్.ఎం ఫాజిల్, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి.శ్రీనివాసరావు, జిల్లా ఆర్ఎంపీ అధికారి శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, రెవిన్యూ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# రానున్న రెండు నెలల్లో కాలువలు, డ్రైయిన్లు ప్రక్షాళణ

మొదటిపేజి తరువాయి

వాస్తవంగా డ్రెయిన్ ఎంత ఉండాలో తక్షణమే చర్యలు తీసుకోవాలని తహసిల్దార్ను ఆదేశించారు.ఈ సందర్భంగా ఉపసభాపతి కనుమూరి రఘు రామకృష్ణంరాజు మాట్లాడుతూ వాంద్రం గ్రామంలో వరి పంట దెబ్బతిన్నదన్న సమాచారంతో నేడు పరిశీలనకు జిల్లా కలెక్టర్ తో కలిసి రావడం జరిగిందని తెలిపారు. ఈ ప్రాంతంలో ఉన్న 900 ఎకరాలకుగాను సుమారు 50 ఎకరాలు మేర వరి చేను నేలకొరిగిందని తెలిపారు. ఇప్పటికే ఉండి నియోజకవర్గంలో 80శాతం మేర డ్రైయిన్లు, కాలువలపై ఆక్రమణలు తొలగించి నీటిపారుదల వ్యవస్థను స్థిరీకరించడం జరిగిందని, రానున్న రెండు మాసాలలో నూరుశాతం ఆక్రమణలు తొలగించి రైతు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఆక్రమణలు తొలగించేందుకు ఇదే విధానం మార్గదర్శకం కావాలన్నారు. ఎంత వర్షం వచ్చినా పంట పొలాల్లో నీరు నిలవకుండా ఉండాలనదే లక్ష్యం అన్నారు.కుల మతాలకు అతీతంగా ఆక్రమణలు ఎవరివైనా తొలగించడం జరుగుతుందని స్పష్టం చేశారు. కౌలుదారులకు సీసీఏ కార్డుల మంజూరులో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకునేందుకు వ్యవసాయ అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. ఈ సందర్భంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, ఉండి తహసిల్దార్ నాగార్జున, వ్యవసాయ శాఖ ఏడి, రైతులు, తదితరులు ఉన్నారు.

# నీట మునిగిన పంట పొలాలను పరిశీలించిన జేసి రాహుల్





**భీమవరం,మేజర్ న్యూస్ :** భీమవరం మండలం చిన్నఅమీరం గ్రామంలో మొంథా తుఫాన్ కారణంగా నీటమునిగిన వరి పొలాలను బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తుఫాను కారణం నీట మునిగిన వరి పొలాలు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

మండలంలో 5,984 ఎకరాలు వరి పంటకు గాను 1,689 రైతులకు సంబంధించిన 3,340 ఎకరాల విస్తీర్ణంలో వరి పంట నీట మునిగిందన్నారు.ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి 5 రోజులులో పంట నష్టాల వివరాలు సేకరించి సంబంధించిన యాప్లో నమోదు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా అక్కడకు వచ్చిన రైతులతో ఆయన మాట్లాడారు. అనకోడేరు, బొండాడ డ్రెన్లు పూర్తిగా బాగు చేయకపోవడం, ఆక్రమణలకు గురికావడం వలన భారీ వర్షాలుకు పంట పొలాలు మునిగిపోయి ఏటా పంట నష్టపోతున్నామని రైతులు జిల్లా జాయింట్ కలెక్టర్ వద్ద మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఆర్డిఓ,తహసిల్దారులను డ్రైయిన్లు సర్వే చేయించేందుకు చర్యలు తీసుకుని ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు.

ఈ సందర్భంలో ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, ఏ డి ఏ కె.శ్రీనివాస్, తహసిల్దార్ రావి రాంబాబు, మండల వ్యవసాయ శాఖ అధికారి యర్రంశెట్టి ప్రసాద్, రైతులు, తదితరులు ఉన్నారు.

## తుఫాన్ సహాయక చర్యలు ముమ్మరం చేయాలి

మొదటిపేజి తరువాయి

సహాయక కేంద్రాలు ఏర్పాటుచేసి,3422 కుటుంబాలకు చెందిన 7వేల మందికి భోజన,వసతి సదుపాయాలు కల్పించామన్నారు. జిల్లాలో తుఫాన్ తీవ్రత తగ్గుముఖం పట్టడంతో సహాయక శిబిరాలు బుధవారం రాత్రివరకు నిర్వహిస్తామని, బాధిత కుటుంబాలకు కేంద్రం నుండి వెళ్లే సమయం.ఓ కుటుంబాలకు 25 కేజీల బియ్యం, కందిపప్పు,పంచదార, వంటనూనె, రెండు రకాల కూరగాయలు కేజీ చొప్పున అందించడం జరుగుతుం దని, చేనేత కార్మికులు, మత్స్యకార కుటుంబాలకు అదనంగా 25కేజీల బియ్యం అందించడం జరుగుతుందన్నారు. బాధితు లకు మనిషికి వెయ్యి రూపాయలు, గరిష్టంగా కుటుంబానికి 3వేల రూపాయలు అందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు.జిల్లాలో పంట నష్టాల అంచనాలను ఈనెల 30వ తేదీలోగా పూర్తిచేయాలని, వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక,మత్స్యశాఖలకు చెందిన అధికారులు క్షేత్రస్థాయిలో వారిశాఖలను సంబంధించి పంట నష్టాలను పరిశీలించి వెంటనే నివేదికలను సమర్పించాలన్నారు. ముఖ్యంగా తుఫాన్ ప్రభావిత లంక గ్రామాలలో ప్రజలు తుఫాన్ కారణంగా ఎటువంటి ఇబ్బంది పడకుండా అధికారులు తీసుకున్న చర్యలను,జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. ఇటువంటి కార్యక్రమంలో తాను పాలుపంచుకోవడం తనకు ఆనందంగా ఉందన్నారు.తుఫాన్ అనంతరం సహాయక చర్యలను కూడా అదే స్ఫూర్తితో అధికారులు,సిబ్బంది చేపట్టాలన్నారు.జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ మంత్రులు, ప్రజా ప్రతినిధులు, తుఫాన్ ప్రత్యేక అధికారులు అందించిన సూచనలతో తుఫాన్కు ముందుగానే ప్రజలను సహాయక కేంద్రాలకు తరలించడంతో ఎటువంటి ప్రాణ నష్టం సంభవించలేదన్నారు. జిల్లాలో అధికారులు, సిబ్బంది అందరూ విపత్తు సమయంలో బాధ్యతగా పనిచేసి ప్రాణ,ఆస్థి,పశు నష్టం జరగకుండా చూడగలిగారన్నారు. ఉంగుటూరు శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు,ఆర్టీసీ రీజినల్ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు, జిల్లా రెవిన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రానున్న రెండు రోజులలో పెద్దఎత్తున పారిశుద్ధ్య కార్యక్రమాలు

మొదటిపేజి తరువాయి

క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక వెంటనే సమర్పించాలన్నారు. వ్యవసాయ, ఉద్యానవనాలు, పశుసంవర్ధకం ,ఆక్వా నష్టాలకు సంబంధించి సంబంధింత సిబ్బంది వెంటనే ఎన్యూమరేషన్ ప్రారంభించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని,ఫీవర్ సర్వే చేయాలనీ, యాంటీ వీనం,డయేరి యా,వైరల్ జ్వరాలకు సంబంధించి మందులు అన్నిప్రభుత్వ ఆసుపత్రులలో స్టాక్ఉండేలా చూడాలన్నారు. తుఫాన్ కారణంగా దెబ్బ తిన్న రోడ్లు, కాజ్ వేలు, కల్వర్టులు, విద్యుత్ స్థంబాలు, పాఠశాల, ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రభుత్వ వసతి గృహాలు, ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై నివేదిక సమర్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.మైనర్ ఇరిగేషన్ చెరువులు,కాల్వలు, నదులు గట్లను పరిశీలించి, బలహీన గట్ల పటిష్టపరిచేందుకు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

## అంగట్లో ఆడ శిశువు విక్రయంపై చర్యలకు ఆదేశం

మొదటిపేజి తరువాయి

మంగళవారం ఆదేశాలు జారీచేశారు. అంగట్లో ఆడశిశువు పేరిట వివిధ మాధ్యమాల్లో వచ్చిన కథనాలను లోకాయుక్త సుమోటోగా తీసుకున్నారు. శిశువు రక్షణకు తీసుకున్న చర్యలపై నవంబరు 4లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు.

**– పంచాయతీరాజ్ ఉద్యోగి ఒకరు చట్టవిరుద్ధంగా ఒప్పందం ?**

– ఆడశిశువును అమ్మకానికి పెట్టిన జంటతోపాటు. కొనుగోలు చేసిన జంటను మంగళవారం నల్గొండ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.ఈ నెల 25న ఆంధ్రప్రదేశ్లోని గుంటూరు జిల్లాకు చెందిన మధ్యవర్తి కొండలు అనే వ్యక్తిని కలిసి ఏలూరు పంచాయతీరాజ్ శాఖలో ప్రభుత్వ ఉద్యోగి దంపతులతో రూ.2.50లక్షలకు అమ్మకానికి ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది. అందులో భాగంగా ముందుగా రూ.10వేలు ఇచ్చి శనివారం శిశువును తీసుకెళ్లారు. మిగతా నగదును సోమవారం చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు.ప్రస్తుతం తల్లితో పాటు సఖీ కేంద్రంలో ఉన్న శిశువును బాలల సంక్షేమ సమితికి అప్పగించే ఏర్పాట్లు చేస్తున్నారు.నల్గొండ ఎస్పీ శరత్చంద్ర పవార్ బృందం ఈ శిశు విక్రయ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ముమ్మర దర్యాప్తు చేపట్టింది.గతంలో జరిగిన శిశు విక్రయాలతో ఈ ముఠాకు ఏమైనా సంబంధం ఉందా అనే కోణంలోనూ పోలీసులు విచారణ చేపట్టారు.

# గంటలో సహాయ చర్యలు పూర్తిచేసిన అధికారులు





**- చెట్టును తొలగించి విద్యుత్ పునరుద్ధరణ**

**- కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు**

**జీలుగుమిల్లి,మేజర్ న్యూస్ :** అర్ధరాత్రి ఈదురు గాలులకు భారీ వృక్షం విద్యుత్ స్తంభాల పైన పడటంతో మూడు స్తంభాలు విరిగిపోయి విద్యుత్ సరఫరా కు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న అధికారులు అరగంటలో భారీ వృక్షాన్ని తొలగించి మూడు విద్యుత్ స్తంభాలను వేసి విద్యుత్తును పునరుద్దించారు. విపత్తు వచ్చినప్పుడు సహాయక చర్యలు ఇంత వేగంగా ఉంటాయా అంటూ గ్రామస్తులు ఆశ్చర్యపోయారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో మంగళవారం రాత్రి మోందా తుఫాన్ ఈదురు గాలులకు భారీ వృక్షం విద్యుత్ స్తంభాల పైన పడింది. విషయం తెలుసుకున్న మండల అధికారులు డిఎల్‌పిఓ సుబ్బరాయన్,ఎంపీడీవో నిఖిల్ మధు చరణ్, సబ్ ఇన్స్పెక్టర్ క్రాంతి కుమార్,పిఆర్ఏ ఈ రామనజం, కార్యదర్శి ప్రసాద్ బాబు,విద్యుత్ శాఖ ఏఈ నాగశేషుడు, పలువురు అధికారులు తక్షణమే స్పందించి కటింగ్ మిషన్ ద్వారా చెట్టుని తొలగించారు. తక్షణమే విద్యుత్ శాఖ అధికారులు మూడు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి నూతన విద్యుత్ వైర్లను కలిపి విద్యుత్తును పునరుద్దించారు.

ఈ పనులన్నీ గంటలో చకచకా జరిగిపోయాయి. అధికారులు స్పందించిన తీరును చూసి గ్రామస్తులు ఆశ్చర్యపోయారు. రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక శాసనసభ్యులు చిర్రిబాలరాజు ఆదేశాల మేరకు తుఫాన్ విధులు నిర్వర్తించిన అధికారులు తమ విధులను అంకుటితదీక్షతో నిర్వర్తించారు అనడానికి ఇదే నిదర్శనం. అంతేకాకుండా స్థానిక శాసన సభ్యులు చిర్రి బాలరాజు ఎప్పటికప్పుడు అధికారులను సమన్వయం చేసుకుంటూ ఉండటం చేత పనులన్నీ సక్రమంగా జరిగాయి అని పలువురు పేర్కొంటున్నారు.

# పునరావాస కేంద్రాలకు తుఫాన్ బాధితులను తరలింపు

**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్:** శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ ఆదేశాల మేరకు జంగారెడ్డిగూడెం పట్టణ టిడిపి అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్ పట్టణ నాయకులతో కలిసి తుఫాన్ వలన ముంపునకు గురైన వారిని తహసిల్దార్ స్లీవాజోజి,మున్సిపల్ కమిషనర్ కె.వెంకటరమణ, సచివాలయాల సిబ్బందితో కలిసి స్థానిక గద్దే లక్ష్మీనరసమ్మ బాలికల జడ్పీ హైస్కూల్ నందు ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలకు తరలించారు. ఎప్పటికప్పుడు అధికారులతో మొంథా తుఫాను ప్రభావంపై ఎమ్మెల్యే రోషన్ కుమార్ ముందస్తు చర్యలు,తదుపరి చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నారని కిషోర్ తెలిపారు.

ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడటం మన అందరి బాధ్యత అని,ఎక్కడ అలసత్వం వహించకుండా ప్రతి అధికారి,ప్రజా ప్రతినిధి కర్తవ్య పరంగా వ్యవహరి ంచాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పోరేషన్ డైరెక్టర్,కౌన్సిలర్ నంబూరి రామచంద్రరాజు, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, సొసైటీ డైరెక్టర్ పాతూరి అంబేద్కర్, గెడా సుబ్రహ్మణ్యం, సచివాలయ ,రెవెన్యూ,ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



# సహాయకు చర్యలో నిమగ్నమైన అధికార యంత్రాంగం

**- 104 కుటుంబాలకు పునరావసం**

**- 720 ఎకరాల పంట నష్టం**

**- 22 ఎలక్ట్రికల్ పోల్స్ పునరుద్ధరణ**

**పెనుమంట్ర,మేజర్ న్యూస్ :** మొంథ తుఫాన్ తీరం దాటి అనంతరం సహాయక చర్యలు చేపట్టడంలో అధికారులు పూర్తిస్థాయిలో నిమగ్న మయ్యారు. పెనుమంట్ర మండలంలో 11 గ్రామా ల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి104 కుటుం బాలకు 276 మందికి ఆశ్రయం కల్పించారు. ఒక ఇల్లు పూర్తిగానే మరొక ఇల్లు పాక్షింగా దెబ్బతిన్నట్లు మండల తాసిల్దార్ ఏలియమ్మ తెలిపారు.104 కుటుంబాలకు మొంథ తుపాన్ ప్రభావిత కుటుంబాలకు నిత్యావసర వస్తువుల పంపిణీకి కుటుం బాలకు ఉచితంగా అవసరమైన నిత్యావసర వస్తువుల పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మనిషికి వెయ్యి రూపాయలు చొప్పున కుటుంబానికి మూడు వేలు రిలీఫ్ క్యాంపులో తలదాచుకున్న వారికి ఇవ్వటం జరుగుతుందని వాటితో పాటు బియ్యం-25 కిలోలు,రెడ్‌గ్రామ్ దాల్-1కిలోపిండి,నూనె-1లీటర్,ఉల్లిపాయలు-1కిలోబంగాళ దుంపలు-1కిలో,చక్కెర-1కిలో ఉచితంగా అందించబ డుతుందని నిత్యవసర వస్తువుల కిట్లు సిద్ధం చేస్తున్నట్లు ఇంచార్జ్ తాసిల్దార్ ఏలియమ్మ తెలిపారు.



- చెట్లు తొలగింపు

- విద్యుత్ స్తంభాలు లైన్లు పునరుద్ధరణ -

తుఫాను కారణంగా ఈదురు గాలులకు చెట్లు భారీ వృక్షాలు నేలకొరకడంతో 22 విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి వీటిని యుద్ధ ప్రాతిపదికన 52 మంది సిబ్బంది15 కిలోమీటర్ల విద్యుత్ లైన్లో పునరుద్ధరించి, ఓడూరులో ఇండస్ట్రియల్ ట్రాన్స్ఫార్మర్రుదెబ్బ కాలిపోవడం తో కొత్త ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేశారని ఎలక్ట్రికల్ ఏఈ గూడూరి నాగరాజు తెలిపారు.18 గ్రామాలకు విద్యుత్తు బుధవారం సాయంత్రానికి పునరుద్ధరించినట్లు చెప్పారు.పెనుమంట్ర మండలంలో ఈదురుగాలులు వీయడంతో 12,207 ఎకరాలు వరి సాగు చేయగా 14 గ్రామాల్లో 720 ఎకరాలువరి, కూరగాయల సాగు, అరటి సాగు ప్రాథమికంగా నష్టం కలిగినట్లు అంచనా వేశారు. వీటిలో అధికంగా సాగుచేసిన ఎం టియు 70 29 రకం పూర్తిగా పడిపోయినట్లు నిర్ధారించారు. ఆలమూరు, ఓడూరు, పెనుమంట్ర, పొలమూరు గ్రామాల్లో పంట నష్టం అధికంగా ఉందని మండల వ్యవసాయ అధికారిణి బి.దేవి స్వరూప తెలిపారు.

# చక్రదేవరపల్లిలో వైద్య శిబిరం



**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** తుఫాన్ కారణం ంగా చక్ర దేవరపల్లి ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రత్యేకంగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని గ్రామపంచాయతీ సర్పంచ్ సాయిల సత్య నారాయణ తెలిపారు. మండలంలోని చక్రదేవరపల్లిలో బుధవారం మొంథా తుఫాన్ కారణంగా ముందు జాగ్రత్తగా ఆరోగ్య సిబ్బందిని ప్రజల సౌకర్యార్థం అందుబాటులో ఉంచి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయించామని తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని సర్పంచ్ సత్యనారాయణ ప్రారంభించారు. ప్రజలందరూ ఈ వైద్య శిబిరాన్ని ఉపయోగించుకొని ఆరోగ్య వంతులుగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి షేక్ షబ్బీర్,ఎం.ఎన్. హెచ్.వి బేబీ,ఎఎన్ఎం దేవరత్న కుమారి,ఆశా వర్కర్లు బోడా జ్యోతి,ఘంటశాల సీత, సచివా లయం,పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

## గండి పడ్డ ప్రాంతాల్లో

## 'దేశం' రామరాజు,సిపిఎం నేత గోపాలన్ పర్యటన





**నరసాపురం రూరల్, మేజర్ న్యూస్:** మండలంలోని వేములదివి పడమర గ్రామం నుండి చినలంక సముద్ర తీరానికి వెళ్ళే మార్గం (నల్లి గ్రిక్) ప్రాంతంలో దారికి గండి పడిన ప్రదేశాన్ని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు బుధవారం స్వయంగా పరిశీలించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకారుల అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు, నరసాపురం మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సాధికార కమిటీ కన్వీనర్, మాజీ ఏఎంసి చైర్మన్ కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్, నరసాపురం మండల అధ్యక్షులు వాతాడి ఉమా మహేశ్వరరావు,నాయకులు వడ్డీ ముక్తేశ్వరరావు, నాగిడి రాంబాబు, జక్కం కాశీ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా గండిపడ్డ ప్రాంతాన్ని సిపిఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జే యన్ వి గోపాలన్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో నూతనముగా కల్వర్టు నిర్మాణం చేపట్టాలని, ఈ ప్రాంత ప్రజలు, రైతులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌరు పెద్దరాజు తదితరులు పాల్గొన్నారు.

## పునరావాస కేంద్రాల్లో అన్న పానీయాలతో

## టిఫిన్ ఏర్పాటు చేస్తున్న జనసైనికులు



**తాడేపల్లిగూడెం, మేజర్ న్యూస్** తాడేపల్లిగూడెం రూరల్ మండలం జగన్నా ధపురం గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకులు తుఫాన్ బాధితుల పునరావాస కేంద్రాలకు వెళ్లి రెండవ రోజు కూడా ఉదయం టిఫిన్ మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పుల్ల అన్నవరం పంచాయతీ ప్రెసిడెంట్ సిద్ధిన వాసు, సిద్ధిన అప్పారావు జగన్నాధపురం గ్రామ అధ్యక్షులు సులేమాన్, పల్లంట సతీష్ అయినం కోటసత్తులు, మనుబోతు పుల్లారావు వీఆర్వో పద్మావతి పాల్గొన్నారు. రెండు రోజులుగా తుఫాన్ బాధ్యతలకు వారికి కావలసిన భోజనం టిఫిన్ మందులు అన్నీ కూడా జగన్నాధపురం జనసేన పార్టీ నాయకులు వారికి అందజేశారు. బొలిశెట్టి శ్రీనివాస్ ప్రజలకు చేసే సేవ తీరుగా తాము కూడా అన్నదాన కార్యక్రమంలో పాల్గొంటున్నట్టు తెలియజేశారు.

# జిల్లా యంత్రాంగం చొరవతో తగ్గిన తుఫాన్ నష్టాలు

- నష్టపోయిన ప్రతి ఎకరాకు పారదర్శంగా అంచనాలు
- ధాన్యం కొనుగోలు చేసి 48 గంటల్లోగా రైతులు ఖాతాలో నగదు జమ
- జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి



**పెదపాడు,మేజర్‌న్యూస్ :** పెదపాడు మండలం వట్లూరు గ్రామంలో నేలకొరిగిన వరిచేలను రాష్ట్ర పౌరసరఫరాలుశాఖ మంత్రి,ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి,ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్,ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు,వడ్డీలు కార్పొరేషన్ చైర్ పర్సన్ ఘంటసాల వెంకటలక్ష్మి,ఆర్టీసీ విజయవాడ జోన్ 2చైర్మన్ రెడ్డి అప్పల నాయుడుతో కలసి పరిశీలించారు.ఈసందర్భంగా రైతులు వరిదుబ్బులను చూపించి, తమ బాధలను వ్యక్తం చేశారు.1318 వరి రకం వేశామని ఒక ఏకరాకు 42 నుండి 44 బస్తాలు దిగుబడి వస్తాయని, గడ్డి కూడా ఎక్కువ వస్తుందని, పశువులకు పనిచేస్తుందని ఆశించామని తెలిపారు. విపత్తులను తట్టుకునే శక్తి 1318 రకానికి ఉందని అయితే రాత్రి కురిసిన భారీ వర్షాలు,భారీ ఈదురుగాలితో వరిపంటలు నేలకొరి గాయని రైతులను ఆదుకోవాలని కోరారు.స్పందించిన ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ నష్టపోయిన ప్రతి ఎకరాను పారదర్శంగా నష్టంఅంచనాలువేసి ప్రభుత్వపరంగా ఆదుకుంటామని, ఆందోళన చెందవద్దని రైతులకు భరోసానిచ్చారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామని, కూటమి ప్రభుత్వం రైతులు ప్రభుత్వం అని మీకుఅండగా ఉంటామన్నారు.ధాన్యం సేకరించిన 48 గంటల్లోగా రైతులు ఖాతాలో నగదు జమ చేస్తామని, ఆరుగాలం శ్రమించి కష్టపడి పండించిన వరి పంటలకుగిట్టుబాటు ధర అందించటమే మా ప్రథమ కర్తవ్యం అన్నారు.ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ 1318 వరిరకం ఎటువంటి విపత్తులను తట్టుకునే శక్తి ఉందని ఇక్కడ ఎక్కువ మంది రైతులు1318 వరి రకం వేసుకున్నారని తెలిపారు.తుఫాన్ ప్రభావంతో అధిక వర్షాలు,అధిక గాలులు వీచుటవలన రాత్రికి నేలకొరిగాయని తెలిపారు. ఈ ప్రాంత రైతులను ఆయిల్ పామ్ సాగు వైపు ప్రోత్సహిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ జెడి షేక్ హబీబ్ భాషా,ఏడిఇ ఇ.అనిత కుమారి,మండల వ్యవసాయ శాఖ అధికారి షేక్ ఖాసీమ్, గ్రామ సచివాలయ సిబ్బంది, రైతులు, కూటమి నాయకులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## ఇటలీ దేశంలో వికార్ జనరల్ ఫాదర్ బాల గురు పట్టాభిషేక వేడుకలు





**ఏలూరు,మేజర్ న్యూస్ :** ఏలూరు ఆర్ సీఎం పీఠం వికార్ జనరల్ రెవ. ఫాదర్ డాక్టర్ పి.బాల 39వ గురు పట్టాభిషేక వేడుకలు బుధవారం ఇటలీ దేశంలో ఘనంగా జరిగాయి. ఇటలీ దేశంలో సిసిలి అనే రాష్ట్రంలో సెయింట్ ఆంటోనీ చర్చిలో రెవ.ఫా దేవ సహాయం (తెలుగు గురువు) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఫాదర్ బాలా దివ్య పూజను ఇటాలియన్ భాషలో సమర్పించడం విశేషం. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఆ పట్టణ మేయర్ విచ్చేసి ఫాదర్ బాలకి అభినందనలు తెలిపారు. అందరూ ఆయనకి పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ స్టాలిన్,ఫాదర్ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు. గురు పట్టాభిషేక వార్షికోత్సవ సందర్భంగా బిషప్ పొలిమేర జయ రావు జయరావు నుండి ఆశీస్సులు అందుకున్నారు.ఈ సంవత్సరం తనకు ఎంతో అమూల్యమైనదిగా ఫాదర్ బాల తెలియజేస్తూ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## వైద్యులు అందుబాటులో ఉండాలి : ఐటీడీఏ పీవో నాయక్



**బుట్టాయిగూడెం,మేజర్ న్యూస్:** వైద్యులందరూ అందుబాటులో ఉండాలని ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తగా చూసుకోవాలని ఐటీడీఏ పీవోకె.రాములు నాయక్ వైద్యాధికారులను ఆదేశించారు. మండలంలోని బుసరాజుపల్లి గ్రామంలో శిథిలావస్థలో ఉన్న క్వార్టర్స్ ను, స్థానిక క్లస్టర్ ఆసుపత్రిని మంగళవారం రాత్రి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలోని వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని చెప్పారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని తెలియజేశారు.తుఫాను ప్రభావం తగ్గే వరకు క్వార్టర్స్‌లో ఉన్న ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. తుఫాను పై అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.అనంతరం పట్టాయిగూడెం నుండి కన్నాపురం వెళ్లే ప్రధాన రహదారిలోఉన్న అల్లికాలువను పరిశీలించారు.ఆయనతోపాటు తహసిల్దార్ చలపతి రావు, ఎంపీడీవో కుంజా జ్యోతి, ఎస్సై ఉమామహేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## తుఫాను బాధితులను పరామర్శించిన 'కొత్తపల్లి'



**మొగల్తూరు,మేజర్‌న్యూస్:** మండలంలోనిపేరుపాలెం మెట్రేవు తూఫాన్ రక్షిత శిబిరాన్ని పరిశీలించి ప్రజల యొక్క సమస్యలు అడిగి తెలుసుకుని,వారికి అందుతున్న సదుపాయాలు గురించి కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు ప్రణాళిక బద్ధంగా తుఫాను కు ముందే సురక్షిత ప్రాంతాలకు తరలించడం శుభ పరిణామం అన్నారు. బాధితులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిరంతరం పర్యవేక్షిస్తున్నారని ఆయన అన్నారు. తుఫాను తీవ్రత తగ్గేవరకు ఎవరు స్వగ్రహాలకు వెళ్ళొద్దని కొత్తపల్లి సూచించారు.

## తుఫాన్‌లో చిక్కుకున్న మహిళకు రక్షణ కల్పించిన పోలీస్ కానిస్టేబుల్

- విమెన్ డ్రాప్ ఎట్ హోమ్ ద్వారా సురక్షితంగా కొప్పాకలో అప్పగింత



**ఏలూరు,మేజర్ న్యూస్:** తుపాను నేపథ్యంలో రవాణా సౌకర్యాలు నిలిచిపోవడంతో ఇబ్బంది పడుతున్న ఒక మహిళకు ఏలూరు జిల్లా పోలీసులు విమెన్ డ్రాప్ ఎట్ హోమ్ సేవ ద్వారా రక్షణ కల్పించి, ఆమె స్వగ్రామం వద్ద సోదరికి అప్పగించారు.

- ఘటన వివరాలు –28వ తేదీ రాత్రి సుమారు 11 గంటలకు స్థానిక టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత బస్టాండ్ వద్ద ఒక మహిళ సహాయం కోరింది. నల్లమిల్లి రంగమ్మ తండ్రి వెంకటేశ్వరరావు కొప్పాక గ్రామం పెదవేగి మండలానికి చెందిన ఈ మహిళ రాజమండ్రిలోని బంధువుల ఇంటికి వెళ్లి,తిరిగి ఏలూరు చేరుకుంది.అయితే,తుపాను కారణంగా రవాణా సదుపాయాలు పూర్తిగా నిలిచిపోవడంతో ఆమె తన స్వగ్రామమైన కొప్పాక గ్రామానికి వెళ్లడానికి అవకాశం లేక ఒంటరిగా ఇబ్బంది పడుతూ సహాయం కోసం విమెన్ డ్రాప్ ఎట్ హోమ్ టీమ్‌ను సంప్రదించింది. సమాచారం అందిన ఏలూరు పోలీసు కంట్రోల్ రూమ్ సిబ్బంది వెంటనే విమెన్ డ్రాప్ ఎట్ హోమ్ టీమ్‌కు చెందిన మహిళా పోలీస్ కానిస్టేబుల్,హోం గార్డ్‌లు తక్షణమే ఘటనా స్థలానికి చేరుకుని ఆ మహిళను సురక్షితంగా తమ వాహనంలో తీసుకువెళ్లి ఆమె స్వగ్రామమైన కొప్పాక గ్రామం వద్ద ఆమె సోదరికి అప్పగించారు. ఈ సమయంలో తుపాను వలన భారీ వర్షం ఉన్నప్పటికీ, పోలీసులు తమ విధులను నిర్వర్తించారు. కంట్రోల్ రూమ్ అధికారులు విమెన్ డ్రాప్ పెట్ హోమ్ ద్వారా మహిళల భద్రతకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

# అధికారులు ప్రాణా నష్టం జరగకుండా కష్టపడ్డారు





- రాష్ట్ర విప్ బొలిశెట్టి శ్రీనివాస్

**తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ యంత్రాంగం యావత్తూ అహర్నిశలు కృషి చేస్తూ తుఫాన్ బారిన పడకుండా ప్రజలందరును సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారని రాష్ట్ర విప్ బోలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. మొంథా తుఫాన్ నేపథ్యంలో భారీ వర్షాల కారణంగా తాడేపల్లిగూడెం పట్టణం 6వ వార్డ్‌కు చెందిన సుమారు 20 కుటుంబాలకు చెందిన యానదులను జిల్లా పరిషత్ హైస్కూల్ లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో వసతి, భోజన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో అన్ని శాఖల అధికారులు గత 48 గంటలుగా నిద్రాహారాలు మరచి విధులను నిర్వహించారాని అన్నారు. కృష్ణయపాలెం,అలంపురం, రావిపాడు తదితర గ్రామాలలో పర్యటించగా ఇప్పటివరకు 1400 ఎకరాలను పంట నష్టాన్ని అధికారులు గుర్తించారని, మరింత విశ్లేషణ చేయనున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు, ఎమ్మార్వో సునీల్ కుమార్,వర్తనపల్లి కాశి,చాపల రమేష్,గట్టెం నాని,మద్దాల మణికుమార్,పాలూరి వెంకటేశ్వర రావు,శ్రీను,రామ్, లక్ష్మణ్, పిడుగు రామ్మోహన్ బ్రదర్స్, పసల కొండ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## పునరావాస చర్యలలో ఎటువంటి లోపం లేకుండా చూడాలి



**బుట్టాయిగూడెం,మేజర్ న్యూస్:** మొంథా తుఫాన్ ప్రభావంపై తహసిల్దార్ చలపతిరావు మంగళవారం రాత్రి సిబ్బందితో సమావేశం నిర్వహించారు.రైతులకు, ప్రజలకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లోని వీఆర్వోలు వీఆర్ఏలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పునరావాస చర్యలలో ఎటువంటి లోపం లేకుండా చూడాలన్నారు. సమావేశంలో రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

# తుఫాను నష్ట నివారణలో సమైక్య కృషి







**– కేంద్రమంత్రి,రాష్ట్ర మంత్రులు, జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ**
**– పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే నాయకర్**

**నర్సాపురం,మేజర్ న్యూస్:** గత పది రోజులుగా మెంధా తుఫాన్ వస్తుంది. దీనివల్ల తీవ్ర నష్టం జరగవచ్చు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి అంటూ రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు, రాజకీయ ప్రముఖులు పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. అనుకున్నట్లుగానే మంగళవారం ఉదయం నుండి దీని ప్రభావం తీవ్ర రూపం దాల్చింది. అధిక వర్షంతో పాటు గాలులు పెద్ద ఎత్తున వెయ్యడంతో చెట్లు విరిగిపడ్డాయి. కరెంటు స్తంభాలు, తీగలు ఊడిపోయాయి. వందల ఏళ్ల సంవత్సరాల నాటి చెట్లు నేలకొరిగాయి. తుఫాను అనగానే అనేక చోట్ల ప్రాణ నష్టం జరుగుతుంది. నరసాపురం తీర ప్రాంతంలో ఈ తుఫాను కల్లోలం సృష్టించింది. ఇక్కడే తీరం దాటింది. అయినప్పటికీ ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. స్థానిక ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ వ్యూహాత్మకంగా పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు.లోతట్టు గ్రామాల ప్రజలను ఈ కేంద్రాలకు తరలించారు.శిథిలావస్థలో ఉన్న ఇల్లు, పూరే గుడిసెలలో ఎవరో నివాసం ఉండకుండా పునరావాస కేంద్రాలకు తరలించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ తుఫాను పై ప్రత్యేక దృష్టి సారించింది.ప్రత్యేక అధికారి ప్రసన్న వెంకటేష్, కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ,రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి రవికుమార్,నిమ్మల రామానాయుడు తదితరులకు బాధ్యతలు అప్పజెప్పింది. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి,నరసాపురం ఆర్డీవో దాసిరాజు తదితరులను పర్యవేక్షించాలని,ఎటువంటి నష్టం జరగకుండా చూడాలని ఆదేశించింది. తుఫాను నర్సాపురానికి దగ్గరలో మంగళవారం రాత్రి తీరం దాటినప్పటికీ




ఇటువంటి ప్రాణం నష్టం లేకుండా అధికారులు నాయకులు సమిష్టిగా కృషి చేశారు. రెవెన్యూ అధికారులతో పాటు పోలీసు శాఖ, ఆరోగ్య సిబ్బంది పునరావాస కేంద్రాల్లోని ప్రజలను కంటికి రెప్పలా కాపాడారు. పెదమైన వానిలంక,వేములదీవి,సర్దుకొడప,పాతపాడు, తదితర ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి వేలమంది తీర ప్రాంత వాసులను అక్కడికి చేర్చారు. దీనితో ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా తీవ్రమైన తుఫా ను నుండి ఈ ప్రాంత ప్రజలను కాపాడారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యేలు కొత్తపల్లి జానకిరామ్, బండారు మాధవ నాయుడు, తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు,డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ,రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు,ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు మైలా వసంతరావు, పలువురు ప్రజా ప్రతినిధులు లోతట్టు ప్రాంత గ్రామాలను సందర్శించటం, పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలకు ధైర్యం చెప్పడంలో సఫలీకృతులయ్యారు. ఏది ఏమైనా రాష్ట్రంలో చర్చనీయాంసంగా మారిన మెంధా తుఫాను నుండి ప్రజలను కాపాడడంలో అధికారులు, రాజకీయ నాయకులు చేసిన సమిష్టి కృషి ఫలితాలని ఇచ్చిందని చెప్పవచ్చు.

# పునరావాస కేంద్రంలో దుప్పట్ల పంచిన బిజెపి నాయకులు

**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్ :** మొంథా తుఫాన్ వలన నిరాశ్రలైన బాదితుల సహాయార్థం తుఫాన్ పునరావాస కేంద్రాన్ని తాడేపల్లిగూడెం జిల్లా పరిషత్ హై స్కూల్లో ప్రభుత్వం ఏర్పాటు చేశారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ ఆదేశాలు మేరకు పట్టణ బిజెపి అధ్యక్షుడు దువ్వా శ్రీనివాస్ ఆధ్వర్యంలో తుఫాన్ బాధితులను పునరావాస కేంద్రంని సందర్శించి సుమారు 50 మందికి దుప్పట్లు, బిస్కెట్ ప్యాకెట్స్ అందజేశారు. బాధితులను సందర్శించిన రాష్ట్ర కార్యదర్శి భోగిరెడ్డి ఆదిలక్ష్మి,కార్యవర్గ సభ్యులు కోట రాంబాబు,కో కన్వీనర్ రామగాని సత్యనారాయణ, పాటే నాగేశ్వరరావు, వీఆర్వీఎల్ నారాయణ, అడపా రమేష్,వన్నెంరెడ్డి నవీన్, కంచర్ల రాజా, క్రాంతి, పడాల కావ్యరెడ్డి,గంటా వెంకటలక్ష్మి తుఫాన్ బాధితుల పునరావాస కేంద్రాన్ని సందర్శించినారు.



# ఎలాంటి విపత్కర పరిస్థితులైనా ఎదుర్కోవడానికి ప్రభుత్వం సిద్ధం





**– పునరావాస కేంద్రాలను పరిశీలించిన ఎమ్మెల్యే కామినేని**

**కైకలూరు, మేజర్ న్యూస్,** ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ అస్యూరెన్స్ కమిటీ చైర్మన్, శాసనసభ్యులు డా.కామినేని శ్రీనివాస్ మొంథా తుఫాన్ నేపథ్యంలో సుడిగాలి పర్యటన చేశారు. పెద్దఎడ్లగాడి వద్ద కొల్లేరు,పుల్లవ డ్రైన్ నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. అనంతరం మణుగునూరు, పెనుమాకలంక, భైరవపట్నం గ్రామాల ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కైకలూరు మార్కెట్ యార్డ్‌లోని ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను పరిశీలించిన అనంతరం కలిదిండి మండలంలో పర్యటించారు. పడమటి పాలెం, సున్నంపూడి, చిన్న తాడినాడ గ్రామాలలో తుఫాను బాధితుల కోసం ప్రభుత్వ పాఠశాల నందు పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు, ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ ఎవరు అధైర్య పడవద్దని మీకోసం ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని, రెస్క్యూ ఫోర్స్ ని ఏర్పాటు చేసారు. అని వారితో పాటు కూటమి నేతలు రేయింబవళ్ళు కష్టపడుతున్నారు. ఎలాంటి విపత్తర పరిస్థితులు వచ్చిన ఎదుర్కోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అధికారులు కూడా చాలా చక్కగా వారి విధులు నిర్వహిస్తూ ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూస్తున్నారన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఆహారం,మెడిసిన్స్ అందించాలని అధికారులను ఆదేశించారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో బాధితుల సహాయార్థం ప్రభుత్వం చేసే సహాయంతో పాటుగా పార్టీలకు అతీతంగా దాతలు,స్వచ్ఛంద సేవా సంస్థలు మానవత్వంతో ముందుకు వచ్చి సహాయం కోసం చూస్తున్న వారిని ఆదుకోవాలని పిలుపునిచ్చారు.

## పంట మునిగిన ప్రాంతాలను పరిశీలించిన మాజీ మంత్రి 'కొట్టు'





**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్ :**తాడేపల్లిగూడెం రూరల్ ప్రాంతంలో మెంథా తుఫాను వల్ల పంట నష్టపోయిన రైతులను తాడేపల్లిగూడెం వైఎస్ఆర్ సీపీ ఇన్చార్జి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ పర్యటించారు. మెంథా తుఫాన్ కారణంగా తాడేపల్లిగూడెం నియోజకవర్గం రూరల్ మండలం అరుళ్ల, నందమూరు, కృష్ణయ్య పాలెం, పెంటపాడు మండలంలోని అల్లంపురం, బి కొండేపాడు గ్రామాలు పర్యటించి రైతులతో ముచ్చటించారు. గత ప్రభుత్వంలో రైతులకు కేవైసీ, భీమ వంటి పథకాలు రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకున్నటువంటి ఘనత జగన్మోహన్ రెడ్డిగా దిక్కుతుందని, కానీ ప్రస్తుత పరిస్థితులలో రైతులపై కూటమికి చిన్న చూపు ఉందని ప్రభుత్వ తీరును యద్దేవా చేశారు. పలు గ్రామాల్లో నీట మునిగిన వరి పంటను మాజీమంత్రి కొట్టు సత్యనారాయణకు చూపించారు.నియోజకవర్గం జిల్లా నాయకులు ప్రెసిడెంట్‌లు రూరల్ మండల ప్రెసిడెంట్‌లు సభ్యులు ఎంపీటీసీలు పెంటపాడు మండల అద్యక్షులు ప్రెసిడెంట్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## భారీ వర్షాలతో నీట మునిగిన నాగమ్మ కాలనీ



**పెనుగొండ, మేజర్ న్యూస్:**తుఫాను కారణంగా కురిసిన భారీ వర్షాలతో పెనుగొండ మండలంలోని సిద్ధాంతం గ్రామం నాగమ్మ కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం నీరు ఇళ్లలోకి చేరి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. కాలనీ మొత్తం మునిగిపోవడంతో నివాసితులు నిరాశ్రయులయ్యే పరిస్థితి నెలకొంది.ఈ సందర్భంగా సిపిఎం పార్టీ సిద్ధాంతం గ్రామ కార్యదర్శి కప్పల రత్నరాజు మాట్లాడుతూ,"గత ఆరేళ్లుగా ప్రభుత్వాలు నాగమ్మ కాలనీని పూర్తిగా విస్మరించాయి.పేద ప్రజలకు ఇళ్లు ఇచ్చి వదిలేశారు, కానీ రోడ్లు, డ్రైన్లు, తాగునీటి వంటి ప్రాథమిక సదుపాయాలు ఇప్పటికీ కల్పించలేదు.ప్రతి వర్షాకాలంలో ఇళ్లు మునిగిపోతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు కన్నెత్తి చూడటం లేదు,అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కొత్త కూటమి ప్రభుత్వం రోడ్లు,డ్రైన్లు, త్రాగునీటి సదుపాయాలు కల్పించి కాలనీ ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు గ్రంధి రాంబాబు, కొమ్మన అచ్యుతానందం, పోలనాటి వెంకట్రావు, నక్క సత్యనారాయణ, తానేటి మందులు, పులిని సత్యవతి తదితరులు నాగమ్మ కాలనీని సందర్శించి, ప్రజల సమస్యలను తెలుసుకున్నారు.

## అడ్డంగా ఉన్న చెట్లను తొలగించిన అగ్నిమాపక సిబ్బంది



**పాలకొల్లు,మేజర్ న్యూస్:** మొంథ తుఫాను ఉధృతికి, చెట్లు నేల కోరిగాయి, మండలంలో చందపర్రు ,ఉల్లంపర్రు గ్రామంలో రోడ్లపై అడ్డంగా చెట్లు పడిపోవడంతో అగ్నిమాపక కేంద్రం సిబ్బంది తొలగించారు.ఈ కార్యక్రమంలో సహాయజిల్లా అగ్ని మాపక అదికారి.వై.వి.జానకిరామ్,అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల భద్రతకు భరోసా కల్పించిన యంత్రాంగం

**– ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు చర్యలు**
**– అన్ని శాఖల అధికారులకు ఎమ్మెల్యే రాధాకృష్ణ ధన్యవాదాలు**



**తణుకు,మేజర్‌న్యూస్ :** మొంథా తుపాను నేపథ్యంలో ప్రజల భద్రతకు భరోసా కల్పిస్తూ నిరంతరం అందుబాటులో ఉండి ఎక్కడా ఎలాంటి ప్రాణ,ఆస్తినష్టం జరగకుండా చర్యలుతీసుకున్న అన్ని శాఖల అధికారులకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ధన్యవాదములు తెలియజేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తుపాను హెచ్చరికలు వచ్చిన నాటి నుంచి తుపాను తీరం దాటే వరకు అప్రమత్తంగా ఉండి సమర్థవంతంగా ఎదుర్కొన్నామని చెప్పారు. అన్నిశాఖల అధికారులు, సిబ్బంది, కూటమి నాయకులు ప్రజలకు మెరుగైన సేవలు అందించేలానే ఉద్దేశంతో మొంథా తుపాను మొదలైన నాటి నుంచి ప్రజలను అప్రమత్తం చేస్తూ పలు తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు ఏర్పాటు చేయడంలో కృషి చేశారన్నారు. ముఖ్యంగా తుపాను ప్రభావంతో వీచిన తీవ్రమైన గాలులకు తణుకు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో చెట్లు విరిగిపడి అక్కడక్కడా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగినప్పటికీ మున్సిపల్ అధికారులతో పాటు ఫైర్,విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది,ఎంపీడీవోలు,తహసీల్దార్లు స్పందించి రక్షణ చర్యలు చేపట్టడంతోపాటు చెట్లు తొలగించి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించి ప్రజలకు ఇబ్బందులు రానీయ కుండా చూశారన్నారు. పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న వారికి బుధవారం మధ్యాహ్నం భోజనం అనంతరం వారి వారి నివాసాలకు పంపించివేశారని చెప్పారు. తుపాను ప్రభావంతో మరోరెండ్రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే రాధాకృష్ణ కోరారు.

## ప్రత్తిని పరిశీలించిన వ్యవసాయ అధికారి



**కుక్కునూర్,మేజర్‌న్యూస్ :** తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు కుక్కునూరు మండలంలో పలు గ్రామాలలోని ప్రత్తి పొలాలను మండల వ్యవసాయ అధికారి ఆర్.బాలాజీ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మండలంలో ప్రత్తి కాయ దశ నుండి ప్రత్తి తీసే దశ వరకు ఉన్నదనియు, ఈ వర్షాలకు ప్రత్తి కాయలో తేమ పెరిగి కాయ కుళ్ళు ఏర్పడుతుంది అని తెలిపారు. నివారణ చర్యల్లో భాగంగా కాపర్ ఆక్సీ క్లోరైడ్‌ను 3గ్రాములు లేదా ప్లాంటోమైసిన్‌ను 1 గ్రాము లేదా కార్బెండజిమ్ 2 గ్రాములును లీటర్ నీటికి కలుపుకుని వారానికి ఒకసారి,2సార్లు పంటకు పిచికారి చేసుకోవాలని తెలిపారు. ప్రత్తి కొనుగోలు కేంద్రం జంగారెడ్డి గూడెంలో ఏర్పాటు చేశామని, కనీస మద్దతు ధరగా ప్రభుత్వం ఒక క్వింటాలు ప్రత్తికి రూ.8110గా నిర్ణయించింది అని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క ప్రత్తి రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారు కిసాన్ కపాస్ అనే యాప్ ను ఈ సంవత్సరం నూతనంగా తీసుకొని వచ్చారని, దాని లో ముందు గా రైతు తనంతట తాను గా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునని రిజిస్ట్రేషన్ చేసుకున్న తదుపరి స్లాట్ బుక్ చేసుకుని ఏరోజు ఎప్పుడు ప్రతి అమ్ముకోవాలో అనే ఆప్షన్ కూడా రైతుకు పూర్తిగా అందుబాటులోకి తీసుకువచ్చారని అన్నారు.ఈ కార్యక్రమంలో రైతులతో పాటు గ్రామ వ్యవసాయ సహాయకులు సుధారాణి, భాగ్యలక్ష్మీ, కుమారి పాల్గొన్నారు.

## పునరావాస కేంద్రంలో ఆహారం, మంచి నీరు, వసతి సౌకర్యం



**పెనుమంట్ర,మేజర్‌న్యూస్ :** మొంథా తుపాన్ కారణముగా ఆచంట శాసన సభ్యులు పితాని సత్యనారాయణ పిలుపు మేరకు పెనుమంట్ర గ్రామంలో ముంపునకు గురి అయినా గోస్తాని నది పరివాహక ప్రాంతం, రాజీవ్ కాలనీ ఏరియాలో ముంపుకు గురి అయిన ప్రజలకు ముందస్తు గానే ప్రభుత్వం వారు స్థానిక హై స్కూల్ ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలోకి తరలించారు. వారికీ కావలిసిన ఆహారం, మంచినీరు వసతి సౌకర్యం కూటమి ప్రభుత్వం ఆధ్వర్య లో కూటమి నాయకులు గంటా వాసు,గోపరాజు రవి, నరాలశెట్టి వెంకటేష్, శుభాకార్, మణికంఠ, జోగి వెంకటేశ్వర్లరావు,గోపిరెడ్డి, మీనా బుజ్జి,తదితరులు సహాయం అందజేశారు, ఈకార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఏలియమ్మ పెనుమంట్ర ఎస్ఐ స్వామి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, విఆర్ఓ నాగబాబు, సచివాలయ సిబ్బంది,ఏఎన్ఎం ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.

# మొంథా తుఫానుతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి





– పంగిడిగూడెంలో పూల తోటను పరిశీలించిన రైతు సంఘం నాయకులు

**ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్ :** మొంథా తుఫాను వలన నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని, నష్టపోయిన ఉద్యాన పంటల రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం ద్వారకాతిరుమల మండలంలోని పంగిడిగూడెం, ఎం.నాగులపల్లి గ్రామాలలో ఉద్యాన పంటలకు జరిగిన నష్టాలను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు పరిశీలించారు. రైతులను అడిగి నష్టం వివరాలను సేకరించారు. పంగిడిగూడెం గ్రామంలో బంతిపూలు పంట నష్టాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ మొంథా తుఫాన్ రైతులకు తీవ్ర నష్టాన్నిరైతులకు తీవ్ర నష్టాన్ని, విషాదాన్ని మిగిల్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. పంగిడిగూడెంలో రూ.50 వేలు పెట్టుబడి పెట్టి బంతిపూలు సాగు చేసిన రైతు నష్టపోయారని చెప్పారు. తడిచిన పూలు మార్కెట్లో కొనే పరిస్థితి లేదన్నారు.

వర్షాలకు తయారైన పూలు పాడైపోయాయన్నారు. గెలలు తయారీ దశలో అరటి తోటలు పడిపోయాయన్నారు. ఇతర ఉద్యాన పంటలకు నష్టం జరిగిందని చెప్పారు. అప్పులు చేసి పెట్టుబడి పెట్టిన రైతులు నష్టపోయి అప్పుల ఊబిలోకి కూలిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టాలను నమోదు చేసి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, జిల్లా కమిటీ సభ్యులు గుర్రం రాంబాబు, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు మానుకొండ వీర్రాజు పలువురు రైతులు పాల్గొన్నారు.

## మంత్రులు నారాయణ, సత్య కుమార్‌తో ఎమ్మెల్యే బడేటి చంటి భేటీ





**అమరావతి/ఏలూరు, మేజర్ న్యూస్:** అమరావతి సచివాలయం నందు బుధవారం మున్సిపల్‌శాఖ మంత్రినారాయణని, ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) కలుసుకున్నారు. నియోజకవర్గంలోని పలు సమస్యలపై ఎమ్మెల్యే చర్చించారు. పలు పెండింగ్ విషయాలను మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు.

## పూళ్ళ పిహెచ్‌సిలో గర్భిణికి సాధారణ ప్రసవం

**– తుఫాను నేపథ్యంలో**
**పాపకు తగు పేరు పెట్టేందుకు కుటుంబ సభ్యుల ఆలోచన**



**భీమడోలు,మేజర్‌న్యూస్ :** మొంథా తుఫాను తీరందాటే సమయంలో పూళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఒకగర్భిణికి సాధారణ ప్రసవం జరిగింది. జన్మించిన పాపకు తుఫాను నేపథ్యంలో తగు పేరు పెట్టేందుకు బాలిక కుటుంబ సభ్యులు సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం. ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పూళ్ళ సెక్టార్ పరిధిలోని పూళ్ళ గ్రామంలో ఈసంఘటన చోటుచేసుకుంది. జన్మించిన పాపను, బాలింతైన తల్లి భవానిని ఐసిడియస్ జిల్లా పిడి శారదతో పాటు భీమడోలు ప్రాజెక్ట్ సిడిపిఓ రాజశేఖర్ అభినందించారు.తగు ప్రోత్సాహకాలను అందజేశారు.ఇదే క్రమంలో బాలింతకు ఆహారం, పాలు ఇతరాలను సిఐటియు అనుబంధ సంస్థ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పూళ్ళశాఖ నాయకురాలు చల్లమణితో పాటు సెక్టర్ పర్యవేక్షకులు నూర్జహాన్ సమకూర్చారు. వారు నిర్వహించే సర్వేల్లో భాగంగా సెక్టార్ పరిధిలో ఆరుగురు గర్భిణీలు ప్రసవ సమయాలకు దగ్గరగా ఉన్నట్టు గుర్తించారు. ఐసిడిఎస్ బృందం తుఫాను నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యగా చికిత్స కోసం పూళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈనెల 27వ తేదీన చేర్చారు .పూళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ పి అరుణ జ్యోతి తన సిబ్బందితో తగు వైద్య సేవలను అందజేశారు ఈ క్రమంలో 28వ తేదీ రాత్రి ఏడు గంటలు దాటిన తుపాన్ తీరం దాటే సమయంలో భవానీకి సాధారణ ప్రసవం జరిగింది.తల్లి ,బిడ్డ క్షేమంగా ఉన్నారు. ఐసిడిఎస్ ద్వారా గర్భిణీలకు తగు సహాయ సహకారాలు అందజేసే క్రమంలో వారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేర్చేందుకు , ఆతర్వాత అందే సేవలలో తమ వంతు సహకారాలను తనతో పాటుసెక్టార్ పర్యవేక్షకులు, ఇతర అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు అందజేశారని భీమడోలు సిడిపిఓ తెలిపారు.

## 31,1 తేదీలలో క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరం




**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** ఏజెన్సీ లయన్స్ క్లబ్ ,విద్యా వికాస్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఈనెల 31వ తేదీ, నవంబర్ 1వ తేదీన క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు క్లబ్ అధ్యక్షులు దాసరి శేషు కుమార్ తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జంగారెడ్డిగూడెంలోని విద్యా వికాస్ కాలేజీ ఆవరణలో రెండు రోజులపాటు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. హైదరాబాద్ కు చెందిన బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పటల్ సంబంధించిన వైద్యులు, సిబ్బంది ఈ శిబిరంలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేస్తారన్నారు. ఎంతో వ్యయంతో కూడుకున్న క్యాన్సర్ పరీక్షలు ఉచితంగా చేయించి అవకాశం ఉన్నందున పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాలని కోరారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు అట్లూరు సురేష్,మాజీ జోన్ చైర్ పర్సన్‌లు మద్దిపాటి నాగేశ్వర రావు, పంతగాని వెంకన్న, క్లబ్ వైస్ ప్రెసిడెంట్ కొండపల్లి పండు, తదితరులు పాల్గొన్నారు.

# మొంథా తుఫానుకు ముదినేపల్లి విలవిల

## నేలకొరిగిన చెట్లు - వరి పొలాలు - భయం గుప్పెట్లో ఆక్వా రైతులు





– నిర్వాసితులకు అండగా పునరావాస కేంద్రాలు

**ముదినేపల్లి,మేజర్ న్యూస్ :** మొంథా తుఫాన్ తాకిడికి ముదినేపల్లి ప్రజలు భయం గుప్పెట్లో విలవిలలాడారు.తుఫాన్ కారణంగా మండలంలోని పెదగొన్నూరు , కొర్రగుంటపాలెం,కొత్తపల్లి,అల్లూరు,చిగురుకోట, వడాలి గ్రామాల్లో ప్రాథమిక సమాచారంగా సుమారు 2వేలఎకరాల వరి దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారి ఎం.వేణుమాధవ్ తెలిపారు. గురులో ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ దెబ్బతిన్న వరి పొలాలను పరిశీలించారు.పలు ప్రాంతాల్లో ప్రధాన రహదారుల్లో కోరుకొల్లు–బొమ్మినంపాడు, సింగరాయపాలెం వరకు కొత్తపల్లి ,పెదగొన్నూరు వద్ద చెట్లు పడి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.ఈ క్రమంలో ముదినేపల్లి ఎస్ఐ వి.ఎస్ వీరభద్రరావు తన సిబ్బందితో వాహనాల రాకపోకల క్రమబద్ధీకరించడానికి యుద్ధ ప్రాతిపాతికిన చెట్లను తొలగించారు. వడాలి, ముదినేపల్లి ,అల్లూరు , ప్రొద్దువాక గ్రామాల్లో పలు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయగా కైకలూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు,ఏపీ టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్,పోసిన పాండురంగారావు ,పోలవరపు లక్ష్మీరాణి ,పి జె ఎస్ మాల్యాద్రి ,ఎండి జానీ , పెనుమత్స త్రినాధరాజు తదితర నాయకులు నిర్వాసితులను పరామర్శించి సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

# నీట మునిగిన పంటల వివరాలను ఐదు రోజుల్లో సమర్పించాలి

– జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశం



**భీమవరం,మేజర్‌న్యూస్ :** కలెక్టరేట్ ఛాంబర్ నుండి జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మొంథా తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాల వలన నీట మునిగిన పంటల వివరాలను తెలుసుకునేందుకు సంబంధిత శాఖల అధికారులతో బుధవారం గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఐదు రోజుల్లో నీట మునిగిన పంటల వివరాలను సేకరించి పంట నష్టాలు నివేదికను సమర్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.పడిపోయిన పంట పొలాలు నీటా మునిగిన వరి చేల నుండి నీరు బయటకు పంపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పంట నష్ట వివరాలు తెలుసు కునేందుకు రైతు సేవ కేంద్రాల వద్ద సమావేశాలు ఏర్పాటు చేసి వివరాలను సేకరించాలని అన్నారు. పంట నష్టం జరిగిన ప్రతి రైతును ఆదుకునే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు.ఈ గూగుల్ మీట్ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, ఏడీలు, ఎంఏవోలు పాల్గొన్నారు.

# మద్దిలో లక్ష లిల్లీ పూలతో లక్షార్చన కార్యక్రమం



**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** మండలంలోని గుర్వాయిగూడెంలో శ్రీ మద్ది ఆంజనేయ స్వామివారి దేవస్థానంలో కార్తీక మాసం సందర్భంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి లక్ష లిల్లీ పూలతో లక్షార్చన కార్యక్రమం ఆలయ అర్చకులు,వేద పండితులు ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో హనుమద్ దీక్షదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని ఆలయ సహాయ కమిషనర్,కార్య నిర్వాహణ అధికారిణి ఆర్ వి చందన తెలిపారు.

# తుఫాన్ ప్రభావిత ప్రాంతాలలో ముమ్మురంగా పారిశుద్ధ్య పనులు

– త్రాగునీరును క్లోరినేషన్ చేసిన తర్వాతనే విడుదల చేయాలి

– ప్రజలు కాచి చల్లార్చిన నీటిని మాత్రమే వినియోగించాలి




**భీమవరం,మేజర్ న్యూస్ :** మొంథా తుపాను కారణంగా జిల్లాలో ఎటువంటి ప్రాణ, పశు నష్టం జరగలేదని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగ రాణి స్పష్టం చేశారు. తుఫాను, భారీ వర్షాల కారణంగా జిల్లాలో భీమవరం మండలం తోకతిప్ప గ్రామంలో రోడ్లు రెండు అడుగుల మేర, నరసాపురం మండలం బియ్యపు తిప్ప గ్రామంలో రోడ్లపై ఒక అడుగు మేర వర్షపు నీరు నిలిచిందన్నారు. నీరు తొలగింపు చర్యలను చేపట్టడం జరిగిందన్నారు. జిల్లాలో 93 ఇళ్ళు, 174 విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నా యన్నారు. జిల్లాలో బలమైన ఈదురు గాలులు కారణంగా 662 చెట్లు నేల కొరిగాయాన్నారు. రోడ్లపై విరిగిపడిన చెట్లను యుద్ధ ప్రాతిపదికన తొలగించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూసేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాలలో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించే పనులలో విద్యుత్ శాఖ సిబ్బంది నిమగ్నమై ఉన్నారని తెలిపారు.జిల్లాలోని మొంథా తుఫాను ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు రోజువారీ నిత్యావసరాలను ఉచితంగా పంపిణీ చేసేందుకు అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఐదు రోజులపాటు వేటను కోల్పోయినందున ప్రభుత్వం నిర్ణయం మేరకు మత్స్యకార కుటుంబాలకు 50 కేజీల బియ్యం అమలు చేయాల న్నారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పునరావాస కేంద్రాల్లోని ప్రతి కుటుంబానికి రూ.3వేలు చొప్పున ఆర్థిక సహాయం అందజేయాలన్నారు. ఈ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు.ప్రతి బాధిత కుటుంబానికి 25 కేజీల బియ్యం,1కిలో కంది పప్పు, 1లీటరు వంట నూనె, 1కిలో ఉల్లిపాయలు, 1కిలో బంగాళాదుంపలు, 1కిలో చక్కెర అందజేయాలని తెలిపారు.ప్రజలు కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగడానికి వినియోగించాలన్నారు.గ్రామాలు, పట్టణాల్లో పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖ పెద్ద ఎత్తున పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. త్రాగునీటిని క్లోరినేషన్ చేసిన తర్వాతనే విడుదల చేయాలన్నారు.

# ఆరుగురు జంగారెడ్డిగూడెం నేతలకు చింతలపూడి ఏఎంసిలో చోటు



**జంగారెడ్డిగూడెం,మేజర్‌న్యూస్ :** చింతలపూడి ఏఎంసి నూతన పాలకవర్గంలో జంగారెడ్డిగూడెం పట్టణం,మండలానికి చెందిన ఆరుగురు కూటమి నాయకులకు ప్రాధాన్యం కల్పించారు. ఏఎంసి వైస్ చైర్మన్ గా ప్రముఖ లాయర్, టిడిపి సీనియర్ నాయకులు మారిశెట్టి వీర వెంకట సత్యనారాయణ నియమితులయ్యారు. ఈయన సతీమణి మారిశెట్టి బాల చిట్టెమ్మ టిడిపి సీనియర్ నాయకురాలు.ఆమె పలు పదవులను అలంకరించారు. సత్యవరపు వెంకటేశ్వరరావు (బుల్లి),పాకనాటి అంజిబాబు కూడా పట్టణ వాసులే.మిగిలిన ముగ్గురిలో రూరల్ గ్రామాలకు చెందిన చిలపరెడ్డి ఇంద్రాణి (పేరంపేట), దండే పద్మ (లక్కవరం), వల్లభనేని అనసూయ (దేవులపల్లి) ఉన్నారు. మొత్తం 16 మంది డైరెక్టర్లలో ఆరుగురు జంగారెడ్డిగూడెం మండలానికి చెందిన వారే కావడంతో పలువురు టిడిపి నాయకులు ఎమ్మెల్యే రోషన్ కుమార్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఇదిలా ఉండగా జిల్లా టిడిపి అధికార ప్రతినిధి పెనుమర్తి రామ్‌కుమార్ బుధవారం వైస్ చైర్మన్ మారిశెట్టి సత్యనారాయణ స్వగృహానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి బీసీ సాధికారిక డైరెక్టర్ చేను ప్రసాద్, ననుబోలు అంజి,తదితరులు పాల్గొన్నారు.

## జడ్పిటిసి సామంతపూడి సహకారంతో బిక్ష ఏర్పాటు

**టి.నర్సాపురం,మేజర్‌న్యూస్:** శ్రీ అన్నపూర్ణ విశాలాక్షి సమిత కాశీ విశ్వేశ్వర స్వామి వారి దివ్య క్షేత్ర ప్రాంగణంలో 28వ రోజు బుధవారం మాల ధరించిన భక్తులకు అన్న ప్రసాదం టి నర్సాపురం జడ్పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు (సూరిబాబు) స్వామి,సహకారంతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా అన్నదాన కమిటీ సభ్యులు మాట్లాడుతూ కార్తీకమాసం కావడంతో కాశీ విశ్వేశ్వర స్వామి వారిని దర్శించు కోవడానికి అధిక సంఖ్యలో భక్తులు వస్తున్నారని, మాల ధరించి దీక్ష చేపట్టిన స్వాములతో పాటు వచ్చిన భక్తులందరికీ అన్న ప్రసాదాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని వివరించారు.

## పడిపోయిన వరిపంట - పరిశీలిస్తోన్న అధికారులు,రైతులు

– మొంథా తుఫాన్ వల్ల 113 ఎకరాల్లో దెబ్బతిన్న పంట



**కామవరపుకోట,మేజర్‌న్యూస్:** మండలం పరిధిలో ఖరీఫ్ 2025 సీజన్లో 3300 ఎకరాల వరి సాగు చేశారని, ప్రస్తుతం గింజ గట్టిపడే దశలో ఉందని మండల వ్యవసాయశాఖాధికారి ముత్యాలరావు తెలిపారు. రెండు రోజుల నుండి మొంథా తుఫాను వల్ల మండలంలో రావికంపాడు, గుంటుపల్లి, ఉప్పలపాడు, కె ఎస్ రామవరం, అంకాలంపాడు, కామవరపుకోట తదితర గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి బుధవారం వరి పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 67 మంది రైతులకు చెందిన 113 ఎకరాల పంట గాలులకు పడిపోయిందన్నారు. పంట ప్రాథమిక నష్టం అంచనా వేస్తున్నామని, రైతులు తమ పొలాల్లో అందుబాటులో ఉండి పొలాలను గ్రామ వ్యవసాయ సహాయకులకు చూపించాలన్నారు. ఈ వర్షంతో గింజలు రంగు మారకుండా ఒక ఎకరానికి 200 మిల్లీలీటర్లు ప్రోపి కొనజోలు మందు పిచికారి చేయాలని,పడిపోయిన వరి కంకిపై గింజ మొలకెత్తకుండా ఉండడానికి ఐదు శాతం ఉప్పు ద్రావణం (అనగా 50 గ్రాములు కల్లుప్పు ఒక లీటర్ నీటికి )కలిపి పిచికారి చేయాలన్నారు. రైతులు సలహాల కోసం గ్రామ వ్యవసాయ సహాయకులను లేదా మండల వ్యవసాయ అధికారిని 8331056709 నెంబర్లో సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

# అందరి ప్రార్థనలు ఫలించి,దేవుని దయతో స్వల్ప నష్టంతో బయటపడ్డాం

- పునరావాస కేంద్రాల నుండి వెళ్లే కుటుంబాలకు 25 కేజీలు బియ్యం, సరుకులు, నగదు
- మనిషికి వెయ్యి,గరిష్టంగా కుటుంబానికి రూ.3 వేలు అందజేస్తాం
- మంత్రి నాదెండ్ల ,కలెక్టర్ వెట్రిసెల్వి ,ఎమ్మెల్యేలు చింతమనేని,పత్సమట్ల





**పెదపాడు,మేజర్న్యూస్ :** పెదపాడు మండలం హనుమాన్ జంక్షన్ – ఏపూరు గ్రామం యంపిపి ప్రాథమిక పాఠశాలలో బుధవారం పునరావాస కేంద్రాన్ని సందర్శించి, బాధిత కుటుంబాలను కలసి, ఇప్పటివరకు అందుకున్న సౌకర్యాలు అడిగితెలుసుకుని, బియ్యం, నిత్యవసర సరుకులు, నగదు పంపిణీని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మరియు జిల్లా ఇంచార్చి మంత్రి నాదెండ్ల మనోహర్,జిల్లాకలెక్టరు కె.వెట్రిసెల్వి,ఎమ్మెల్యే చింత మనేని ప్రభాకర్,ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఆర్టీసీ విజయవాడ జోన్ 2 చైర్మన్ రెడ్డి అప్పలనాయుడులు సంయుక్తంగా పాల్గొని బాధితులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఇంచార్చి మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ముంపుబారిన కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించి సకల సౌకర్యాలు కల్పించామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అపార అనుభవం సూచనలు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు, సమీక్షలు చేస్తూ అధికార యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలు జారీచేశారని అన్నారు.అందరూ ప్రార్థనలు ఫలించి, దేవుని దయతో స్వల్ప నష్టంతో తుఫాన్ నుండి బయటపడ్డామని అన్నారు.ఈ నాలుగు రోజులు అనుభవాలు భవిష్యత్తులో మనకు ఎంతోగానో ఉపయోగపడతాయని అన్నారు. సివిల్ సప్లై కార్పొరేషన్ మాశాఖ తరపున రాష్ట్రవ్యాప్తంగా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ముమ్మరంగా సహాయ కార్యక్రమాలు చేపట్టామన్నారు.మరో 48 గంటలు అప్రమత్తంగా ఉండాలని,అధికార యంత్రాంగం సూచనలు,సలహాలు పాటించాలని, పుకార్లు, వదంతులు నమ్మవద్దని ఈ సందర్భంగా ప్రజలకు,రైతులకు మంత్రి నాదెండ్ల మనో హర్ సూచించారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ జిల్లా ఇంచార్చి మంత్రి నాదెండ్ల మనోహర్, జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి సంయు క్తంగా తీసుకున్న సహాయక చర్యలు, తగు జాగ్రత్తలు మా నియోజ కవర్గంలో పునరావాస కేంద్రాలు, సహాయక కార్యక్రమాల్లో పాల్గొనుటకు మాకు ఎంతగానో స్ఫూర్తి కలిగి 20 గంటలు పైగా పనిచేసి, విజయవం తంగా కార్యక్రమాలు చేసుకున్నామని అన్నారు.బాధిత కుటుం బాలకు బియ్యం, నిత్యవసర సరుకులు,నగదు పంపిణీ తొలి కార్యక్రమం నా నియోజకవర్గంలో జరుగుటనాకుఎంతో సంతృప్తిని, సంతోషం కలిగింద న్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో యం.అచ్యుత అంబరీష్,డియస్ వో ఇ.బి.విలియమ్స్,జిల్లా వ్యవసాయ శాఖ జెడి షేక్ హబీబ్ భాషా, తహశీ ల్దారు ఏ.కృష్ణజ్యోతి, మండల అధికారులు,బాధిత కుటుంబాలు, స్థానిక ప్రజలు, రెవిన్యూ, గ్రామ సచివాలయ ఉద్యోగులు, పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వామి ఆలయంలో స్వాములకు భిక్ష

**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్:** మండలంలోని గుర్వాయిగూడెంలో వేంచేసియున్న శ్రీ హరిహర సుత అయ్యప్ప స్వామి వారి దేవస్థానంలో బుధవారం 27వ రోజు బిక్షా కార్యక్రమం జరిగింది. దాతలుగా జంగారెడ్డి గూడెం పట్టణ వాస్తవ్యులు రావూరి కృష్ణ, వెంకట లక్ష్మి మంగతాయారు ,డాక్టర్ తూమాటి రామచంద్ర నాయుడు, సూర్యకుమారి, పోలిశెట్టి వెంకట సత్యనారాయణ,వెంకట నాగమణి దంపతులు వ్యవహరించి జరిపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ ప్రెసిడెంట్ చిన్ని వాసు స్వామి, సెక్రటరీ గంగు జగన్మోహన్ రెడ్డి,నెక్కలపూడి సూర్యచంద్రరావు, కొల్లిపర కృష్ణారావు,రొక్కం కృష్ణారావు,బాకీ శ్రీనివాసరెడ్డి వచ్చిన భక్తులకు అన్ని సదుపాయాలు కలుగజేశారు.



# అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ప్రాణ నష్టాం నిరోధించాం






– జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ వెల్లడి

**కైకలూరు,మేజర్న్యూస్ :** తుఫాన్ ప్రభావంతో రాత్రి సమయంలో ఈదురు గాలులతో అక్కడక్కడ స్తంభాలు కూలి కరెంటు స్తంభించడంతో గ్రామాల్లో అంధకారంగా మారి ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఈదురు గాలులకు కైకలూరు నియోజకవర్గం రూరల్ సీఐ రవికుమార్ నాలుగు మండలాల ఎస్ఐలు కైకలూరు టౌన్ ఇన్స్పెక్టర్ రామ కృష్ణ ఆధ్వర్యంలో టౌన్ ఎస్సైలు వారి సిబ్బందితో కలిసి తక్షణ చర్యలు చేపట్టారు. నియోజకవర్గ పోలీస్ యంత్రాంగం రంగంలోకి దిగి సహాయ చర్యలు చేపట్టారు. ప్రధాన రహదారులు,కైకలూరు టౌన్ పరిధిలోని పెద్ద పెద్ద వృక్షాలు రోడ్డుకి అడ్డంగా విరిగిపడిన చెట్లను యంత్రాల సాయంతో తొలగించి ట్రాఫిక్ అంతరాయం లేకుండా పునరుద్ధరించారు. కలిదిండి గ్రామం సంత మార్కెట్ వెనుక చెరువు పొంగి నీళ్లు ఇళ్లల్లోకి స్వరపడటంతో అక్కడ నివాసం ఉంటున్న 25 కుటుంబాల వారిని జెడ్ పి హెచ్ స్కూల్ పునరావసర కేంద్రాలకు తరలించారు. తాడినాడ గ్రామంలో తుఫాను పునరావాసన కేంద్రాల్లో సుమారుగా 33 మందిని తరలించారు. కొల్లేరు ఉధృతంగా ప్రవహించటంతో కైకలూరు మండలం గోకర్ణ పురం నుండి పైడి చింతపాడు వెళ్లే రహదారి ముంపు బారిన పడటంతో అటువైపు ఎవరు వెళ్ళనివ్వకుండా పోలీసులు పహారా కాస్తున్నారు. బుధవారం జిల్లా ఎస్పీ కే ప్రతాప్ శివ కిషోర్ కైకలూరు పునరావాస కేంద్రాలను సందర్శించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఇంత పెద్ద తుఫాను పోలీస్ రెవెన్యూ ఇతర శాఖల సిబ్బంది సమన్వయం చేసుకుంటూ ఉద్యోగ నిర్వహణ చేయటం వల్ల జిల్లా వ్యాప్తంగా ఒక్క ప్రాణానికి కూడా హాని జరగకుండా కాపాడగలిగామన్నారు.జిల్లా వ్యాప్తంగా అక్కడక్కడ చెట్లు, కరెంటు స్తంభాలు విరిగిపడిన వెంటనే సిబ్బంది స్పందించి చర్యలు తీసుకోవడం వలన ఇటు ట్రాఫిక్‌కు గాని ప్రజలకుగాని ఇబ్బందులు కలగకుండా తొలగించినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో లోతట్టు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న సుమారుగా 3వేల మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి వారికి పునరావాసం కల్పించటం జరిగిందని సిబ్బంది సమన్వయంతో పని చేయడం వలన ప్రాణ నష్టాన్ని నిరోధించగలి గామని అన్ని శాఖల అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, రూరల్ ఇన్స్పెక్టర్ రవికుమార్ ఎస్ఐలు వారి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తి,పంట నష్టం వివరాలను అధికారులకు ఇవ్వండి

- తుఫాన్ ప్రభావిత గ్రామాల నుంచి ఎంపికి ఫోన్లు
- రాత్రి సమయంలో కూడా కాల్స్‌తో అప్రమత్తం చేసిన పుట్టా మహేష్



**ఏలూరు,మేజర్ న్యూస్ :** తీవ్ర తుఫాను సందర్భంగా ఏ సమయంలో ఎటువంటి సహాయం కావాలన్నా సంప్రదించమని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తన ఫోన్ నెంబర్లతో సహా ఇచ్చిన ప్రకటనకు పలు గ్రామాల నుంచి స్పందన వచ్చింది. ముఖ్యంగా టీ.నరసాపురం, పోలవరం, ముదినేపల్లి మండలాల నుంచి ఎంపీ ఫోన్ కు మంగళవారం రాత్రి 11 నుంచి, బుధవారం ఉదయం వరకూ పలువురు కాల్ చేసి తమకు తుఫాన్, భారీ వర్షాలు, తీవ్ర గాలులు కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులను ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. కాల్స్‌కు స్పందించి బాధితులతో స్వయంగా మాట్లాడిన ఎంపీ వెంటనే వెళ్లి వారిని ఆదుకోవలసిందిగా ఆయా ప్రాంతాల మండల పార్టీ నాయకులను,అధికారులను ఆదేశిం చారు.కొయ్యలగూడెం మండలం బయ్యనగూడెం 14వ వార్డులో కరెంటు వైర్లు క్రిందకి వేలాడుతూ ప్రజల భయాందోళన గురవుతున్న సమయంలో ప్రజలు మండల టిడిపి అధ్యక్షులు పారేపల్లి నరేష్ ఫోన్ ద్వారా ఎంపీకి సమస్యను తెలియజేయడం జరిగింది. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి అక్కడ ప్రజలకు ఇబ్బంది లేకుండా కరెంటు సమస్యను తీర్చాలని,తుఫాన్ కారణంగా ఒరిగిపోయిన చెట్లను వెంటనే తొలగించాలని ఆదేశాలు ఇవ్వడం జరిగింది.పోలవరం మండలం పాతపట్టిసం గ్రామం వద్ద కొవ్వాడ కాల్వ ఉధృతంగా ప్రవహిస్తుండటం తో గ్రామస్థులు ఆందోళన చెందుతూ ఫోన్ చేయడంతో స్పందించిన ఎంపీ కాలువ డిఈ తో, ఇతర అధికారులతో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. కాలువ ప్రవాహాన్ని నిరంతరం గమనిస్తూ ఉండాలని,ప్రజలకు ధైర్యం చెప్పాలని, సహాయ చర్యలకు సిద్ధంగా ఉండాలని సూచించారు.

## ముంపు పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



**నరసాపురం రూరల్,మేజర్ న్యూస్:** మండలంలోలోని వైఎస్ పాలెం, లక్ష్మనేశ్వరం,ఎల్బిచర్ల గ్రామాలలో మొంథా తుఫాను కారణంగా నీట మునిగిన వరి చేలను వ్యవసాయ శాఖ,మారుటేరు వరి పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు కెవికె ఉండి శాస్త్రవేత్తలు పంటపొలాలను సందర్శించారు. మండలంలో సుమారుగా 2000 ఎకరాలలో పంట నీట మునిగడం జరిగినది. రైతులకు శాస్త్రవేత్తలు సలహాలు సూచనలు తెలియజేశారు. రైతులు వరి పూత దశ నుంచి కోత దశలో ఉన్నప్పుడు వారి పొలంలో మురుగు కాలువలు ఏర్పాటు చేసి నీటిని వెంటనే తీసివేయాలని అలాగే వరి పంట పడిపోయిన చోట్ల నిలబెట్టి కట్టాలని అలానే 5శాతం ఉప్పు ద్రావణం 150 గ్రాములు కళ్ళు ఉప్పు లీటర్ నీటికి కలిపి కోసిన పనులపై పిచికారి చేయాలని తెలిపారు.తెగులు నివారణగాను నీటిని తొలగించిన తర్వాత ఎకరానికి ప్రొపి కొనజోల్ 25 ఈసీ 200 మిల్లీమీటర్లు లేదా. హెక్సకొనజోల్ 5 సీ్స 400 మిల్లీలీటర్లు పిచికారి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి సహదేవ రెడ్డి ప్రిన్సిపల్ సైంటిస్ట్ అగ్రోనమి,ఎం వి కృష్ణంరాజు ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఎక్స్టెన్షన్,వి రోజా సైంటిస్ట్ ప్లాంట్ బ్రీడింగ్, నరసాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు పీవీవీ ఎన్ఎస్పి ప్రసాద్, ఏ శ్రీనివాస రావు, మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ ఆర్ బిందు ప్రవీణ,ఉద్యాన శాస్త్రవేత్త పి విజయలక్ష్మి సర్వే విభాగం శాస్త్రవేత్త అగ్రికల్చర్ ఆఫీసర్ అడబాల జ్యోషిల,హార్టికల్చర్ ఆఫీసర్ కె ప్రియదర్శిని, ఆర్ఎస్కె ఇన్చార్జెస్ కె వెన్నెల సిహెచ్ నాగజ్యోతి రైతులు తదితరులు పాల్గొన్నారు.